## క్లుప్తంగా

### ప్రశాంతంగా హిందీ పరీక్ష



హిందీ ప్రచార సభ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

**గుమ్మలక్ష్మీపురం(కురుపాం):** కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన హిందీ ప్రచార సభ పరీక్ష( హైదరాబాద్) ప్రశాంతంగా ముగిసింది. విశారద, భూషణ్, విద్వాన్ విభాగాల్లో నిర్వహించిన పరీక్షలకు 53 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ టి.శంకరరావు, ప్రచార సభ పరీక్షల నిర్వాహకులు సంతోష్‌కుమార్ తెలిపారు.

### ప్రకృతి వ్యవసాయంతో తెగుళ్ల నివారణ

- జిల్లా వనరుల కేంద్రం ఏడీఏలు శారద, శ్రీనివాస్



కామందొరవలసలో కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**సీతానగరం:** ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సాగు చేపడితే తెగుళ్ల బెడద ఉండదని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏలు శారద, శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గుచ్చిమి, కామందొరవలస గ్రామాల్లో ఏఓ ఎస్. అవినాష్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవాళీ ఆవు మూత్రం, జిల్లేడు ఆకులతో కషాయం తయారీపై అవగాహన కల్పించారు. ఏఓ ఎస్. అవినాష్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలో 1300 భూసార పరీక్షలు నిర్వహించామన్నారు. పాపమ్మవలస, ఇప్పలవలస, పెదబొగిలి, గుచ్చిమి గ్రామంలో పొడతెగులు ఎక్కువగా ఆశించిందని, దీని నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు ఎల్. సుబ్రహ్మణ్యం, పకీరు నాయుడు, మోహనరావు, గుచ్చిమి రైతులు చిన్నంనాయుడు, బి.శంకరరావు, పీఏసీఎస్ సీఈఓ రెడ్డి సింహాచలం, వ్యవసాయ సహాయకులు ప్రణీత్, శ్రావణ్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

### 300 మంది వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు అందిస్తున్న సర్పంచ్ వెంకటరత్నం, శ్రీనివాసరావు

**మక్కువ:** వినాయక నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వృద్ధులకు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. మండలంలోని వెంకటభైరిపురం గ్రామంలో సర్పంచ్ మరడ వెంకటరత్నం చేతులు మీదుగా 300 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం కమిటీ సభ్యులు, గ్రామస్తులు, ఎంఎస్ఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా 2వేల మందికి అన్నసమారాధన చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో వరసిద్ధి వినాయక కమిటీ సభ్యులు, ఎంఎస్ఆర్ ఫౌండేషన్ యూత్ పాల్గొన్నారు.

### అధైర్యపడొద్దు అండగా ఉంటాం..

**సాలూరు:** నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధైర్యపడొద్దని.. నేను మీకు అండగా ఉంటానని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర భరోసా ఇచ్చా రు. పట్టణంలోని తన స్వగృహంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై, ప్రజలపై కక్షసాధింపు చర్యలకు, బెదిరింపులకు పాల్పడుతోందని, ఎవరూ భయపడవద్దని అన్నారు. మీకు అండగా నేను ప్రజాపోరాటం, న్యాయపోరాటం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ ప్రభుత్వంలో ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని, చిరు ద్యోగులను తొలగిస్తోందని ఆరోపించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న తాను ఏనాడు ఇటువంటివి చూడలేదన్నారు. గతంలో ఏనాడు ఉద్యోగులు, అధికారులు ఇంతటి ఆందోళనకర పరిస్థితుల ను ఎదుర్కోలేదని పేర్కొన్నారు. సూపర్‌సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభు త్వం ఆ హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఎద్దేవా చేశారు. వందరోజుల కూటమి ప్రభు త్వ పాలన సూపర్ ఫెయిల్యూర్‌గా అభివర్ణించారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకనని చెప్పుకున్న పవన్‌కళ్యాణ్ నేడు కనిపించడం లేదన్నారు. విజయవాడ వరదల్లో ప్రజలకు అండగా నిలవలేకపోయా రని విమర్శించారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేసి వరద బాధితుల కష్టాలను తెలుసుకుని వారికి అండగా నిలిచారన్నారు.

# పీవీటీల సంక్షేమానికి 'పీఎం జన్‌మన్'

- ఆదివాసీల సామాజిక, ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చడమే లక్ష్యం
- గ్రామసభల్లో అభివృద్ధి పనుల గుర్తింపు
- హేమ్లెట్స్‌లో సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలుకు చర్యలు



గుమ్మలక్ష్మీపురం మండలంలో అభివృద్ధికి నోచుకోని చింతమానుగూడ పీవీటీజీ గ్రామం

**గుమ్మలక్ష్మీపురం:** బలహీన గిరిజన సమూహాల(పీవీటీజీలు) సామాజిక, ఆర్థిక పరిస్థితులు మెరుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల 'ప్రధాన మంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్' (పీఎం-జన్‌మన్) పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా 2023–24 బడ్జెట్‌లో గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. రానున్న మూడేళ్ల పాటు పీవీటీజీ హేమ్లెట్స్ (గ్రామాల్లో) పురోగతి కోసం ఆ నిధులను ఖర్చు చేయనున్నారు. ఈమేరకు గత ఏడాది నవంబర్ లోనే పీవీటీజీ గ్రామాలను గుర్తించారు. అయితే ఆయా ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికల రూపకల్పనకు మరోసారి గ్రామసభలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలొచ్చాయి. దీంతో అధికారులు బృందాలుగా ఏర్పడి ఆయా పీవీటీజీ గ్రామాలపై దృష్టి సారించారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తుండగా.. తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి, వెలుగు, ఉపాధి హామీ, తదితర శాఖల అధికారుల సమన్వయంతో ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తూ గ్రామాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఆదివాసీలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను గుర్తిస్తున్నారు.

**గ్రామసభలో గుర్తించే అంశాలు..**

ఆదివాసీ గిరిజనులు కోరిన విధంగా పక్కా ఇళ్లు, మరుగుదొడ్ల సదుపాయం, స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రతీ ఇంటికి మంచి నీటి కుళాయి, 100 లేదా అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రతీ ఆవాసానికి రోడ్డు సౌకర్యం, హేమ్లట్ గ్రామాలను కలుపుతూ రోడ్డు సదుపాయం, ప్రతీ ఇంటికి విద్యుత్, విద్యావకాశాలు మెరుగుపర్చడం, అవసరమైన ప్రతీ పాఠశాలకు వసతి గృహం సదుపాయం



పీవీటీజీ గ్రామంలో నిర్వహిస్తున్న పీఎం జన్‌మన్ గ్రామసభ

, అందరికీ నాణ్యమైన విద్య, నైపుణ్య వికాశం, అందరికీ ఆరోగ్యం, అందరికీ పౌష్టికాహారం, జీవనోపాధులు మెరుగుపర్చడం, ప్రచార సాధనాల సౌకర్యాలు మెరుగుపర్చడం, ఉచిత రేషన్, ఉచిత వంట గ్యాస్, ఆయుష్మాన్ భారత్, గర్భిణులకు ఆర్థిక సాయం, గర్భిణులు బాలింతలకు పోషకాహారం, ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించడంతో పాటు, 100 శాతం వ్యాక్సినేషన్, టీబీ నిర్మూలన, మధ్యాహ్న భోజనం, ప్రధాన మంత్రి జన్ ధన యోజన, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలను గిరిజనులు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చూడనున్నారు.

**813 పీవీటీజీ హేమ్లెట్స్**

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, సాలూరు, పాచిపెంట, మక్కువ, పార్వతీపురం మండలాల్లో మొత్తం 813 పీవీటీజీ హేమ్లెట్స్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. పీఎం జన్‌మన్ పథకం ద్వారా గుర్తించిన పనులన్నీ పూర్తిచేస్తే పీవీటీజీలు సామాజికంగా–ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని పీవీటీజీలు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

**పీవీటీజీ గ్రామాలైనప్పటికీ..**

శత శాతం పీవీటీజీ గ్రామాలైనప్పటికీ తమ గ్రామాల్లో పీఎం జన్‌మన్ గ్రామసభలు నిర్వహించకపోవడం పట్ల పీవీటీజీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు గుమ్మలక్ష్మీపురం మండలంలోని మండ పంచాయతీకి చెందిన మల్లుగూడ, టిక్కబాయి, సింగారంపేట గ్రామాల్లో పీవీటీజీ గ్రామాలైనప్పటికీ గుర్తించలేదు. అలాగే కురుపాం మండలంలోని బియ్యాలవలస పంచాయతీలోని దురుబిలి, రంగుపురం, గొండిలోవ, సూర్యనగర్ గ్రామాలున్నాయి. ఈ అంశంపై గుమ్మలక్ష్మీపురం ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు వద్ద ప్రస్తావించగా ఆయా గ్రామాలను కూడా పీవీటీజీ గ్రామాలుగా గుర్తించాలని కోరుతూ ఇప్పటికే ఐటీడీఏ అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలియజేశారు.

### నిబంధనలు తప్పనిసరి

**పాలకొండ రూరల్:** పండగల నేపథ్యంలో పట్టణ ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్సై కె.ప్రయోగమూర్తి కోరారు. వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. పాలకొండ–శ్రీకాకుళం, విశాఖ, వీరఘట్టం రహదారుల్లో అనుసరించాల్సిన ట్రాఫిక్ నిబంధనలపై ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. కోట దుర్గమ్మ దేవస్థానం కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రధాన మార్కెట్, వ్యాపార సముదాయాల వద్ద సిబ్బంది నిత్యం పర్యవేక్షించాలన్నారు. అనుమానితుల కదలికలపై దృష్టిపెట్టాలని సూచించారు.

### పేకాటరాయుళ్లపై కేసు నమోదు

**సీతంపేట:** మండలంలోని జరడకాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న ఇద్దరిని పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. వారి వద్ద రూ.36,500 నగదు, పేకముక్కలు సీజ్ చేసినట్టు చెప్పారు.

### గోపీనాథునికి ప్రత్యేక పూజలు

**భామిని:** మండలంలోని లివిరిలో వెలసిన గోపీనాథరాధాకృష్ణ ఆలయంలో వామన ఏకాదశ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దశావతారాలలో ఒకటైన వామనుని అవతారంలో స్వామివారిని అలంకరించి పూజలు చేశారు. ఉత్కళ సాంప్రదాయంలో స్వామివారిని అలంకరించి పూజలు చేయడం ఆనవాయితీ. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

### జాతీయ యోగా పోటీలకు అర్హత



తృతీయ స్థానం సాధించిన రూపవతికి జ్ఞాపికను అందజేస్తున్న స్పోర్ట్స్ అథారిటీ కమిటీ ప్రతినిధులు

**సీతానగరం:** రాష్ట్రస్థాయిలో విశాఖ జిల్లా భీమిలిలో జరిగిన యోగా స్పోర్ట్స్ చాంపియన్ షిప్ 2024లో బూర్జ ఆయుష్ వైద్య కేంద్రంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ ఎం.రూపవతి 3వ స్థానంలో నిలిచి జాతీయస్థాయి కి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయుష్ కేంద్రం డాక్టర్ టి.హేమాక్షి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ బూర్జ ఆయుష్ వైద్య ఆస్పత్రిలో ఇన్‌స్ట్రక్టర్ రూపవతి రాష్ట్రస్థాయి పోటీల్లో మూడవ స్థానం సాధించడం అభినందనీ యమని ప్రశంసించారు. జాతీయస్థాయిలో త్వరలో జరగనున్న పోటీల్లోనూ రూపవతి ప్రతిభ కనబరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రూపవతికి ఆయుష్ వైద్యాధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

# భారీ వాహనాలతో అవస్థలు



ఐటీడీఏ సమీపంలో నిలిపివేసిన భారీ కంటైనర్లు

**సీతంపేట:** పాలకొండ–హడ్డుబంగి ప్రధాన రహదారిలో నిత్యం పదుల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒడిశా వెళ్లే క్రమంలో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు రహదారులు సైతం ఛిద్రమౌతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం భారీ వాహనాలను జాతీయ రహదారి మీదుగా దారి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# అన్నసమారాధన



పాలకొండ రూరల్: తుమరాడలో నిర్వహిస్తున్న అన్నసమారాధన

**పాలకొండ రూరల్:** వినాయక ఉత్సవాల్లో భాగంగా తుమరాడ గ్రామంలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 15 వందల మంది ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామాల్లో ఈ తరహా సామూహిక వేడుకలు, పండగలు ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. అలాగే పట్టణంలో చిన్నకాపువీధిలో మహాన్నదాన కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు.



సీతంపేట: అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**ఎస్టీ న్యూ కాలనీలో..**

**సీతంపేట:** వినాయక ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్టీ న్యూకాలనీలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. భారీగా భక్తులు తరలివచ్చి గణనాధున్ని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

### బత్తిలికి రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు, ప్రశంసా పత్రంతో గ్రహీత శ్రీనివాసరావు

**భామిని:** మండలంలోని బత్తిలికి చెందిన బత్తిలి శ్రీనివాసరావుకు ఏపీఎంపీఏ రాష్ట్ర స్థాయి అవార్డ్ వరించింది. ఆంధ్రప్రదేశ్ ఎంఈడీ అసోసియేషన్ 2024 విద్యాసంవత్సరానికి బెస్ట్ టీచర్ ఎడ్యుకేటర్ అవార్డును ఏపీ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దయానందరెడ్డి చేతుల మీదుగా అందుకున్నట్లు ఆదివారం ఆయన తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పరిధిలో వంశధార కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ తెలుగు విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాసరావుకు అవార్డు రావడం పట్ల పలువురు అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## దసరాకు రైలు సర్వీసు ప్రారంభమయ్యేలా చూడండి

- ఎంపీని కోరిన మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

**సాలూరు:** సాలూరు–విశాఖపట్నం మధ్య రైలు సర్వీసు దసరా పండగకు ప్రారంభమయ్యేలా కృషి చేయాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అరుకు ఎంపీ గుమ్మ తనూజారాణిను కోరారు. ఈ మేరకు ఆదివారం ఆమెతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ నెల 23న విశాఖపట్నంలో జరుగనున్న రైల్వే బోర్డు సమావేశంలో ఈ అంశంపై సంబంధిత అధి కారులతో మాట్లాడాలని కోరారు. ఈ సర్వీసు ప్రజలకు అనువైన సమయాల్లో రోజుకు కనీసం నాలుగైదు సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం, తరువాత ఎన్‌డీఏ ప్రభుత్వ పెద్దలకు ఈ రైలు సర్వీసు గురించి పలుమార్లు కోరినట్లు చెప్పారు. ఆ ప్రయత్నాలు నేడు ఫలించాయని అన్నారు. ఈ రైలు సర్వీసు దసరాకు ప్రారంభించి నియోజకవర్గ ప్రజలకు దసరా కానుకగా అందివ్వాలని కోరారు.

# వరిలో సస్యరక్షణ ఇలా..

**పాలకొండ రూరల్:**

ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టాయి. పంట భూముల్లో నిలిచిన నీరు బయటకు వెళ్లిన క్రమంలో పంటను కాపాడుకునేందుకు రైతులు అధికారుల సూచనలు పాటించాలని వ్యవయాశాఖ ఏడీ కె.రత్నకుమారి అన్నారు. మండలంలో వరద ముంపునకు గురైన శివారు ప్రాంతాలను ఆదివారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. పొలంలో నీరు తగ్గిన వెంటనే ఎకరానికి 25 కిలోల యూరియ, 15 కిలోల పోటాష్ ఎరువును పైపాటుగా వేసుకోవాలని సూచించారు. లేదంటే 19–19–19లు లీటరుకు 5 గ్రాముల వంతున ఎకరాలకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందన్నారు. వర్షాల కారణంగా వరిలో పాముపొడ తెగులు ఉధృతి పెరిగేందుకు అవకాశం ఉందని, ఈ తెగులు సోకిన పంటలో దుబ్బు చేసే దశ నుంచి ఆకులపై మచ్చలు ఏర్పడి క్రమేణ అవి పెద్దవై పాముపొడ మచ్చలుగా మారుతాయన్నారు. దీని ఉధృతి ఎక్కువైతే మొక్కలు ఎండిపోతాయి. ఈ తెగులు నివారణకు ప్రోపికోనజోల్ 1 మి.లీ. లేక వాలిడా మైసిన్ 2 మి.లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. ద్రావణాన్ని లీటరు నీటికి కలిపి దుబ్బుకి తగిలేలా 15 రోజులు వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. వరిలో అగ్గి తెగులు సోకినపుడు ముదురు ఆకులపై నూలుకండే ఆకారంలో గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు ఎరబ్రడతాయి. క్రమేపి మచ్చలు కలిసిపోయి పంట ఎండిపోయినట్లు కనిపిస్తుందని, దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లేదా కాసుగామైసిన్ 2.మి.లీ. మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. అగ్గి తెగులు, పొడ తెగులు కలిపి ఆశించినపుడు ట్రైపాక్సిస్ట్రోబిన్+టేబ్యుకోనజోల్ (నేటివో) 0.4 గ్రా. చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారి చేయడం ద్వారా మంచి ఫలితం ఉంటుందని సూచించారు.

## రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మహేంద్రపురం గ్రామస్తులు

**గుమ్మలక్ష్మీపురం:** కురుపాం మండలం నీలకంఠాపురం పంచాయతీ మహేంద్రపురం గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని, నీలకంఠాపురం ప్రధాన రహదారి నుంచి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### పశువుల అక్రమ రవాణా



విక్రంపురం సమీపంలో అంతఃరాష్ట్ర రహదారిపై తరలిస్తున్న పశువులు

**కొమరాడ:** ఒడిశా నుంచి కొమరాడ మీదుగా పార్వతీపురం సంతకు మూగజీవాల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా కబేళాలకు తరలిస్తున్నా.. అధికారులు మాత్రం చూసీచూడనట్ల వ్యవరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతర్ రాష్ట్ర రహదారిపై వందలాది పశువులను తోలుకుంటూ తీసుకుని వెళ్లడం వల్ల వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వందలాది కిలోమీటర్ల మేర నడిపించడంతో పశువుల కాళ్లు రక్తమోడుతున్నా వాటి వ్యధను పట్టించుకునే వారు లేరు. వందలాది కిలోమీటర్ల దూరం పశువులను నడిపించుకుంటూ ఎందుకు తీసుకువెళ్తున్నారనే అనుమానం పోలీసులకు, జంతు సంక్షేమ సంఘాలకు కలగకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పశువుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

## కేజీబీవీ విద్యార్థినులకు చాలీచాలని కూర



విద్యార్థులకు పెడుతున్న చికెన్ కర్రీ

**సీతంపేట:** సీతంపేట కేజీబీవీలో విద్యార్థినులకు భోజన మెనూలో భాగంగా ప్రతీ ఆదివారం కోడికూర పెడుతున్నారు. అయితే విద్యార్థినులకు 100 గ్రాములు చికెన్ పెట్టాల్సి ఉండగా 50 గ్రాముల లోపే పెడుతున్నారని, ఒకటి లేదా రెండు ముక్కలు మాత్రమే వడ్డిస్తున్నారని విద్యార్థినులు అంటున్నారు. పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 272 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వారికి మెనూ ప్రకారం ఆదివారం మధ్యాహ్నం అన్నం, వండిన చికెన్ 100 గ్రాములు, టమోటా రసం, మజ్జిగ పెట్టాలి. అలాగే శాఖహారులకు బగార రైస్, గోంగూరకూర లేదా చట్నీ, బంగాళదుంపల కుర్మా పెట్టాల్సి ఉంది. బంగాళదుంప కుర్మా పెట్టినప్పటికీ మజ్జిగ, గొంగూరకూర లేదా చట్నీ పెట్టలేదు. ఒక్కొక్కరికి చికెన్ వంద గ్రాములు పెట్టాల్సి ఉన్నప్పటికీ జ్యూస్‌తో కలిపి 50 గ్రాముల లోపే వడ్డించారు. పైగా చికెన్‌లో కూడా బంగాళదుంపలు కలిపి వండటం గమనార్హం. ఈ విషయమై ప్రిన్సిపాల్ బి.రూప వద్ద ప్రస్తావించగా మెనూలో ఎటువంటి వ్యత్యాసం ఉండదని, విద్యార్థినులకు సరిపడా చికెన్ వండి వడ్డిస్తున్నామన్నారు.

## వైద్యుల సూచనలు పాటించాలి

**పాలకొండ రూరల్:** ప్రస్తుత సీజన్‌లో పిల్లల ఆరోగ్య భద్రత విషయంలో తల్లితండ్రులు వైద్యుల సూచనలు పాలించాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో మైదాన ప్రాంత గిరిజన గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి వైద్యసిబ్బందితో ఆదివారం సమన్వయ సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులను అధిగమించే క్రమంలో పిల్లల తల్లితండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యుల సూచనల మేరకు పిల్లలకు తప్పిని సరిగా అవసరమైన వ్యాక్సిన్లు వేయించేలా వారిని చైతన్యపర్చాలన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తున్న స్నేహితులు

**భామిని:** మండలంలోని అనంతగిరికి చెందిన వివాహిత గెల్లంకి ఉమ(29) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మృతురాలి స్నేహితులు(2007–08 బ్యాచ్‌మేట్స్) బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో తామరాపల్లి సంతోష్, బెహరా గిరి, గ్రామస్తులు గెల్లంకి చిన్న, పైల వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

## పోలీసుల సేవాభావం



క్షతగ్రాతుడు శివను ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్తున్న పోలీసులు

**పాలకొండ రూరల్:** విధినిర్వహణలో ఎంతోకొంత కర్కసంగా కనిపించే ఖాకీల్లో కూడా సేవచేసే గుణం ఉంటుందని స్థానిక పోలీసులు నిరూపించారు. సమీప మండలంలో ఓ గర్భిణి ఆస్పత్రిలో ఆదివారం రాత్రి మరణించిన విషయం తెలుసుకుని పాలకొండ ఎస్సై అక్కడి శాంతిభద్రతలు అదుపు చేసేందుకు సిబ్బందితో కలిసి వీరఘట్టం పయనమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలతో పాలకొండ–వీరఘట్టం రహదారిలో భారీ గుంతలు ఏర్పడటంతో వీటిని గమనించక ఓ ద్విచక్ర వాహన చోదకుడు అదుపుతప్పి గోతిలో పడి అచేతన స్థితిలోకి వెళ్లిపోయాడు. చీకటి కావటంతో ఎవరూ ఈ ఘటనను గమనించ లేదు. అటుగా వెళ్తున్న ఎస్సై కె.ప్రయోగమూర్తి అతన్ని గమనించారు. తక్షణమే తన వాహనంలో క్షతగాత్రున్ని ఎక్కించుకుని పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. తానే స్వయంగా స్ట్రెచర్‌పై పడుకోబెట్టి ఆస్పత్రిలోకి తీసుకువెళ్లారు. వైద్యులను సంప్రదించి తక్షణ వైద్య సేవలు అందించేలా చూశారు. సరైన సమయానికి క్షతగాత్రుడిని తీసుకురావటంతో ప్రాణాపాయం తప్పిందని వైద్యులు పేర్కొన్నారు. క్షతగాత్రుడు పట్టణ పరిధిలో గెడ్డకుమ్మరి వీధికి చెందిన డి.శివకుమార్‌గా గుర్తించారు. వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రస్తుతం బాధితుడు కోలుకుంటున్నాడు. ఎస్సైతో పాటు పోలీసులు చొరను ప్రతి ఒక్కరూ ప్రశంసించారు.

## ఏచూరికి నివాళి



ఏచూరి చిత్రపటం వద్ద సంతాపం తెలియజేస్తున్న గ్రామస్తులు

**సీతంపేట:** మండలంలోని దొంబంగివలసలో కామ్రెడ్ ఏచూరి సీతారం సంతాప సభ ఆదివారం నిర్వహించా రు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్య క్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు, పార్టీ సభ్యులు ఎం.రెయ్యన్న, రైకన్న, జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.